# రోడ్డు విస్తరణ జరిగేనా!

- గత ప్రభుత్వ హయాంలోనే 100 ఫీట్ల రోడ్డు మంజూరు
- బండ్లగూడ నుంచి కిస్మత్‌పూర్ వరకు నిత్యం వాహనదారుల అవస్థలు
- శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు



బండ్లగూడ నుంచి కిస్మత్‌పూర్ వెళ్లే రహదారిపై రాకపోకలు కొనసాగిస్తున్న వాహనదారులు

బండ్లగూడ, జూలై 7: శరవేగంగా విస్తరిస్తున్న శివారు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు సతమతమవుతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్ల విస్తరణ పనులు చేపట్టక పోవడంతో ప్రజలు, ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. నగరానికి అత్యంత సమీపంలో ఉన్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ తీవ్ర రూపం దాలుస్తోంది. కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడ చౌరస్తా వరకు, పర్మాయిస్ హోటల్ నుంచి కేంద్రియ విహార్‌వరకు నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్నదని స్థానికులు పేర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే రద్దీ ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడకు వెళ్లే రోడ్డులో నిత్యం అనేక మంది వాహనదారులు రాకపోకలను కొనసాగిస్తుంటారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ రద్దీ నెలకొంటున్నదని తెలిపారు. దీంతో నానా అవస్థలు పడాల్సి వస్తుందని డుతున్నారు.

### గతంలోనే 100 ఫీట్ల రోడ్డు మంజూరు

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 100 ఫీట్ల రోడ్డు వేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇందుకు అనుమతులు కూడా వచ్చాయి. ఇందుకోసం సంబంధిత అధికారులు రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ పనులను కూడా పూర్తి చేశారు. కానీ ఇప్పటి వరకు రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించక పోవడంతో వాహనదారులు, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకొని వెంటనే రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా..

పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవసరమైన ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుందని స్థానికులు పేర్కొన్నారు. కానీ కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచిపోతున్నా రోడ్డు విస్తరణ పనులపై అధికారుల్లో స్పందన లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### మా పరిధిలోకి రాదు: డీఈఈ యదయ్య

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు 100 ఫీట్ల విస్తరణ పనులు హెచ్‌ఆర్‌డీసీఎల్ వారు చేపడుతున్నారు. గతంలో పీఅండ్‌టీ కాలనీలో రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేశారు. త్వరలోనే కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టవచ్చు.

### పనులు త్వరగా చేపట్టాలి: భాస్కర్‌గౌడ్, కిస్మత్‌పూర్



కిస్మత్‌పూర్ బండ్లగూడ ప్రాంతాల్లో అనేక కాలనీలు వెలిశాయి. నగరానికి దగ్గరగా ఉండటంతో ప్రజలు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్నారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు బయటకు వచ్చే సరికి ట్రాఫిక్ రద్దీ పెరిగి రోడ్లు జామ్ అవుతున్నాయి. దీంతో సమయం వృథా అవుతుంది. వెంటనే అధికారులు స్పందించి కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడ వైపు వెళ్లే రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలి.

## చెస్ కోచ్‌కు థేమ్స్ యూనివర్సిటీ డాక్టరేట్



థేమ్స్ వర్సిటీ ఆఫ్ ఫ్రాన్స్ ప్రతినిధుల నుంచి డాక్టరేట్ అందుకుంటున్న చెస్ కోచ్ చైతన్య

వెంగళరావునగర్, జూలై 7: జూబ్లీహిల్స్‌కు చెందిన చీఫ్ చెస్ కోచ్ ఉద్దిస చైతన్య సురేశ్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. మలేషియాలోని ది థేమ్స్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఫ్రాన్స్ ఆధ్వర్యంలో ఇండోగ్లోబల్ సమ్మిట్ అవార్డ్స్‌లో భాగంగా ఆదివారం చైల్డ్ సైకాలజీ ఇన్ రెఫరెన్స్ ఆఫ్ చెస్ విభాగంలో గౌరవ డాక్టరేట్‌ను వర్సిటీ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య సురేశ్ మాట్లాడుతూ నగరంలోని ఏకాగ్ర చెస్ అకాడమీ చీఫ్ కోచ్‌గా వ్యవహిస్తున్నాని తెలిపారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ సందీప్ నాయుడు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు.

## యువతి అదృశ్యం



ఖైరతాబాద్, జూలై 7: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయింది. ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఏఎస్సై శ్రీరాములు వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చిత్తలూరుకు చెందిన పి.సునీత ఖైరతాబాద్ గంధీనగర్‌లో కుమార్తె రుతు సుప్రియ (19)తో కలిసి ఉంటున్నది. సుప్రియ బేగంపేట డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్నది. ఈ నెల 5న బయటకు వెళ్లిన సుప్రియ తిరిగి రాలేదు. దీంతో తల్లి పోలీసులను ఆశ్రయించింది. కుమార్తెతో పరిచయమున్న సన్నీ అనే యువకుడిపై తనకు అనుమానం ఉందని, అతనితోని వెళ్లి ఉంటుందని సునీత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



గోల్కొండ కోటలో నిర్వహించిన కుమ్మర్ల మొదటి బోనం ఊరేగింపులో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 7: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గోల్కొండలో కుమ్మర్ల బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గోల్కొండ జగదాంభిక అమ్మవారికి మొదటి బోనం ఆదివారం సమర్పించారు. ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, ఆయురారోగ్యాలతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలిగించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి బోనం గోల్కొండ జగదాంభికకు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మొదటి బోనాల ఉత్సవాల్లో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు.

## గురుకుల సమస్యలు పట్టని సర్కార్

### ఆర్‌ఎస్పీకి విన్నవించిన బీఆర్‌ఎస్ నాయకులు



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి విద్యార్థుల సమస్యలు వివరించిన బీఆర్‌ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్, జూలై 7: గురుకుల విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్‌గౌడ్, యాదగిరి తెలిపారు. నగరంలోని మాసబ్ ట్యాంక్‌లో స్వేరో నెట్‌వర్క్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను శంషాబాద్ మండలం పెద్దగోల్కొండకు చెందిన శ్రీకాంత్‌గౌడ్, యాదగిరి కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. తాగునీరుతో పాటు భోజనం, ఇవ్వాల్సిన సామగ్రి సైతం ఇవ్వడం లేదని ఆయన దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన ఆయన సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడిన్నట్టు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలకు నష్టమే జరుగుతుందన్నారు.

## కన్నుల పండువగా జగన్నాథ స్వామి రథయాత్ర



కాటేదాన్‌లో రథయాత్రలో పాల్గొన్న భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 7: మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో పూరి జగన్నాథ స్వామి రథయాత్ర కన్నుల పండుగగా కొనసాగింది. కాటేదాన్ హనుమాన్ ఆలయంలో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి హాజరై పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. దారిపోడవుకు భక్తులు స్వామి వారికి జేజేలు పలికారు. కార్పొరేటర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పూరి జగన్నాథ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గాయదర్, సరోజ్, మున్న, సుదమ, అభిమన్యూ, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, పాండుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేయాలి



జాటోత్ హుస్సేన్‌ను శాలువతో సత్కారం చేస్తున్న సుజాత, తదితరులు

హిమాయత్‌నగర్, జూలై 7: జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ మెంబర్‌గా నియమితులైన జాటోత్ హుస్సేన్ నాయక్‌ను ఆదివారం బంజారా మహిళా సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు సుజాత, సభ్యులు డాక్టర్ ఆనంద్, గోపాల్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కారం చేశారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలు, దాడులు, వేధింపులను నిలువరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా కుమారి



కుమారికి నియామక పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

శంషాబాద్ రూరల్, జూలై 7: రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా తొండుపల్లికి చెందిన కోడూరి కుమారిని నియమిస్తు ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహరెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కుమారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా నియమించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు సహకారం చేస్తానని వివరించారు. ముఖ్యంగా మహిళలు రాజకీయంగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు రాజకీయాల్లోకి వచ్చే విధంగా కృషి చేస్తానని వివరించారు. తనకు అవకాశం కలిపించిన జిల్లా అధ్యక్షుడు నర్సింహరెడ్డి, ప్రేంరాజ్, నంకిషోర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్ బడా గణేశ్ వద్ద ఎమ్మార్పీఎస్ నేత బొలిగిద్ద కుమార్ మాదిగ నేతృత్వంలో సంఘం జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సానం ప్రకాశ్, యు.కృష్ణ, రాజయ్య, నర్సింగ్, స్థానిక బస్తీ నాయకులు మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. – ఖైరతాబాద్

## వ్యాధులపై అవగాహన అవసరం

### డాక్టర్ మనోజ్‌రెడ్డి



హిమాయత్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

హిమాయత్‌నగర్, జూలై 7: దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని కోఠి యూపీహెచ్‌సీ ఆర్‌హెచ్‌ఎఫ్‌డబ్ల్యూటీసీ డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నారాయణగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నీటిలో పెరిగే దోమలను పిల్ల దశలో ఉన్నప్పుడే నిర్మూలించడం వల్ల దోమలను అరికట్టే అవకాశం ఉందని అన్నారు. కుంటలు, పూల కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి తొట్టెలు, సంపులు డ్రమ్ములపై మూతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడు వాపు, బోధకాలు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డెంగీ జ్వరం పారా సిటమాల్‌తోనే తగ్గుతుందని, వాంతులు లేకపోతే ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. డెంగీ జ్వరం తగ్గుతున్న క్రమంలో రక్త పోటు, ప్లేట్‌లెట్లు పడిపోతుంటాయని, ఈ సమయంలో జ్వరం తగ్గిందనే నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మహాగణపతి చెంత సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు

ఖైరతాబాద్, జూలై 7: ఖైరతాబాద్‌లో మహాగణపతి విగ్రహ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. గత నెల 17న 70 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహానికి అంకురార్పణ చేస్తూ కర్రపూజ నిర్వహించారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ విగ్రహ ఏర్పాటులో విఘ్నాలు తొలగాలన్న సంకల్పంతో ఆదివారం సుదర్శన హోమం చేపట్టింది. వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య ఈ క్రతువు వేడుకగా సాగింది. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్, కన్వీనర్ సందీప్ రాజ్, సభ్యురాలు వీణామాధూరి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అవసరం



హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

హిమాయత్‌నగర్, జూలై 7: తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ నగర నూతన కమిటీ ఎన్నికైంది. హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో ఆదివారం యూనియన్ ముగింపు సభ జరిగింది. నగర అధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మహ్మద్ అహ్మద్, ఉపాధ్యక్షులు కె.కాశయ్య, గణేశ్, ఎస్కే మక్బూల్, హుస్సేన్, నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, సహాయ కార్యదర్శులు నాగరాజు, ఎన్.నరసింహ, ఎండీ షరీఫ్, కోషాధికారి జి.శ్రీనివాస్‌తో పాటు 35 మంది సమితి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికుల అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 60 ఏండ్లు దాటిన ప్రతి కార్మికుడికి పెన్షన్ సౌకర్యం కల్పించి, ప్రమాదంలో మరణించిన వారికి రూ.10లక్షలు, సహజ మరణానికి రూ.5లక్షలు, వివాహ కనుకగా రూ.1లక్ష అందజేయాలని కోరారు.

## తెలంగాణ ఎరుకలను దత్తత తీసుకోవాలి



రవీంద్రభారతి, జూలై 7 : తెలంగాణ ఎరుకల జాతిని సీఎం రేవంత్‌రెడ్డి దత్తత తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఆదివాసీ, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడుతూ.. ఎరుకల జాతి అభివృద్ధి కోసం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగులయ్య, మాదిగాని ఎల్లయ్య, మదన్, సాయిరాం, సంజీవ్ పాల్గొన్నారు.

## వృద్ధుడు మృతి

కాచిగూడ, జూలై 7: అనారోగ్యంతో రైల్వేస్టేషన్‌లో వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు (65) శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం చివర్లో కొన్ని రోజులుగా అనారోగ్యంగా ఉంటూ ఆదివారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా కు తరలించారు. మృతుడి ఒంటిపై నషం రంగు చొక్క, గోధుమ రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడు అదృశ్యం

కాచిగూడ రైల్వేస్టేషన్ ఆవరణలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. కాచిగూడ ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌లోని సూర్యనగర్‌కాలనీకి చెందిన లచ్చయ్య కుమారుడు సభావత్ రాజేశ్ ప్రైవేటు ఉద్యోగి. 5వ తేదీన రాజేశ్ స్నేహితులు సాయి, తేజ, అబ్బుతో డబ్బుల విషయం మాట్లాడేది ఉందని కాచిగూడ రైల్వేస్టేషన్‌కు రమ్మన్నారు. రాజేశ్ రైల్వేస్టేషన్‌కు వచ్చి డబ్బులు విషయం మాట్లాడుతుండగా అక్కడి నుంచి రాజేశ్ అదృశ్యమయ్యాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో 6న ఉప్పల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని, తదుపరి విచారణ నిమిత్తం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. సోదరుడు సూర్య సభావత్ ఫిర్యాదు మేరకు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

## శ్మశానవాటిలో దొంగలు

గోల్నాక డివిజన్ హుర్రస్‌పెంటలోని శ్మశానవాటిలో దొంగలు చొరబడి విలువైన వస్తువులను దొంగిలించినట్లు శ్మశానవాటిన అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో శ్మశానవాటికలోకి వచ్చి గంజాయి సేవిస్తున్నారని, సిబ్బంది మందలిస్తే దాడులు చేస్తూ గాయపరుస్తున్నారని వెల్లడించారు. రెండు రోజుల క్రితం శ్మశానవాటిలోని సీసీ కెమెరాలు, పారలు, గంపలు, విలువైన సామగ్రిని దొంగిలించారని పేర్కొన్నారు. విషయాన్ని కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దొంగలను పట్టుకుని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.